క్లుప్తంగా

ప్రతి గడపకూ అయోధ్య అక్షింతలు



తెలగవీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

రాజాం సిటీ: ప్రతీ గడపకు అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు రాజాం ఖండ్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని తెలగవీధిలో సోమవారం 'అయోధ్య అక్షిత్ అభియాన్' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామమందిర ఫొటోతో పాటు పవిత్ర అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

రూ.6.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



ఆదర్శనగర్‌లో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

రాజాం: పట్టణంలోని 17వ వార్డు ఆదర్శనగర్‌లో రూ.6.90 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో సుమారు 300 మీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు మున్సిపల్ ఏఈ భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక సమస్యలను 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు దుస్తుల పంపిణీ



చిన్నారికి దుస్తులు అందజేస్తున్న సాయిప్రశాంత్ కుటుంబ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొత్త అనంతరావు, కొత్తా జ్యోతి, కొత్తా సౌందర్య, భవిత కేంద్రం రిసోర్స్ పర్సన్లు హరిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు



ధాన్యాన్ని ట్రాక్టర్లతో తరలిస్తున్న రైతులు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ ధాన్యం విక్రయాలు జోరందుకున్నాయి. రైతులు వరిపంటను నూర్పిడి చేసి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయిస్తున్నారు. వంగర, కొప్పర, కొప్పరవలస, తలగాం తదితర గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని పెద్ద ఎత్తున విక్రయాలు చేపడుతున్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



నాయిరాలవలసలో భగవద్గీత పుస్తకాలు పంపిణీ

రేగిడి: మండలంలో నాయిరాలవలస, లచ్చారాయపురం, జాడాపేట తదితర గ్రామాల్లో సోమవారం త్రైతసిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. బొద్దాంకు చెందిన త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధనుంజయ, రమేష్, వెంకటరమణ, గోపాలకృష్ణ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల తులాభారం



తులాభారం వేస్తున్న భక్తులు

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తులాభారం వేసి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులున్నారు.



బొబ్బిలి: ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు, ఉద్యోగులు



రాజాం: వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులుకు న్యూ ఇయర్ విషెస్ చెపుతున్న పార్టీ నాయకులు



వంగర: ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కొత్త సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకున్నారు. ఆదివార అర్ధరాత్రి నుంచే సంబరాలు మొదలయ్యాయి. మహిళలు ఇంటి ముందు రంగవల్లులు వేసి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికితే.. యువత కేక్ కట్ చేసి కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. కొత్త ఏడాదిలో తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటూ సోమవారం ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బొబ్బిలిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు క్యాంపు కార్యాలయంలో, రాజాంలో ఎమ్మెల్యే కంబాల జోగులు క్యాంపు కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: కొట్టక్కిలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



రామభద్రపురం: ఎంపీపీ లక్ష్మణరావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు



రాజాం సిటీ: వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ తలే రాజేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు



రాజాం సిటీ: ఎంపీపీ లావేటి సులోచనకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజాం రూరల్ నాయకులు



బొబ్బిలి: ఎమ్మెల్యే శంబంగికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ రాజేశ్వరరావు, రెవెన్యూ అధికారులు



తెర్లాం: ఎంపీడీఓ శంబంగి రామకృష్ణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



బాడంగి: ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల పరిషత్ ఉద్యోగులు



తెర్లాం: ఎంఈఓలు త్రినాథరావు, పాపారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు



సంతకవిటి: హంజరాంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీఆర్‌కు శుభాకాంక్షలు చెపుతున్న కేజీబీవీ ఉద్యోగులు



బాడంగి: తహసీల్దార్ రఫీజాన్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెపుతున్న రెవెన్యూ ఉద్యోగులు



రేగిడి: ఏవీపురంలో ఎంపీపీ అప్పలనరసమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు



తెర్లాం: ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్థు, వైస్ ఎంపీపీ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న లోచర్ల సచివాలయ సిబ్బంది

మహిళలు స్వశక్తితో ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎంలు రత్నాకర్, సత్యనారాయణ

రామభద్రపురం: మహిళలు స్వశక్తితో ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు తదితర పథకాలు అమలు చేస్తోందని ఏపీఎంలు రత్నాకర్, సత్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మండలంలోని గత నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 13,792 మంది మహిళా సంఘ సభ్యులు రూ.18,19 కోట్లు పొందగా ఇప్పుడు మరో విడతగా ఈ నెలలో 10,509 మంది సభ్యులు రూ.5.2 కోట్లు పొందనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలకు ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. స్త్రీనిధి బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో పాటు స్త్రీనిధి బ్యాంకు రుణాల ద్వారా మహిళలు చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. స్వయం ఉపాధి సాధించటంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు బాలకృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు



ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి: మండలంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను ఈనెల 5 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శ్యామలాకుమారి సోమవారం తెలిపారు. మండలంలో 11,021 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ ఈ నెల నుంచి రూ.3 వేలు అందించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు కొత్తగా 200 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, వారందరికీ ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా పింఛన్ డబ్బులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ట్లు చెప్పారు.

166 కొత్త పింఛన్లు మంజూరు

సంతకవిటి: మండలంలో కొత్తగా 166 వైఎస్సార్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలుకు పెంచిందని, ఈ నెల 3 నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కొత్త లబ్ధిదారులకు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు చేతులమీదుగా పింఛన్లు పంపిణీ ఉంటుందన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: పట్టణంలోని రైల్వే స్టేషన్ జంక్షన్‌లోని తాగునీటి పైపులైన్ పాడవడంతో మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. మరమ్మతుల కారణంగా మంగళవారం నాడు పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పొగమంచు



బాడంగిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

బాడంగి: మండలంలో గత కొన్ని రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. మంచు ప్రభావంతో రోడ్లు సరిగా కనిపించక రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు.

అతివలకు అండగా..



పొగిరిలో స్త్రీనిధి రుణంతో ఏర్పాటుచేసిన కజ్జికాయల తయారీ ఫ్యాక్టరీ

- మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చేయూత
- స్త్రీనిధి, పీఎంఈజీపీ రుణాలతో జీవనోపాధి యూనిట్ల ఏర్పాటు
- రాణిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

రాజాం: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతో కృషిచేస్తోంది. వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, తదితర పథకాలను అమలు చేయడం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వాటి పని తీరును మెరుగుపరిచేందుకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు పీఎంఈజీపీ రుణాలను మంజూరు చేస్తోంది. కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు, కుట్టుమిషన్లు, జిరాక్స్ షాపులు వంటివి పెట్టుకునే వారికి ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రాజాం నియోజకవర్గంలో పలు మహిళా సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

1682 మందికి లబ్ధి..

రాజాం నియోజకవర్గంలో గత రెండేళ్లలో 1682 మంది మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ.. కుటీర పరిశ్రమలు, పాన్‌షాపులు, వ్యాపారాలు, వ్యవసాయాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రాజాం మండలంలో ఏడాది కాలంలో 472 మహిళా సంఘాలకు చెందిన 1661 మంది మహిళలు రూ.7.51 కోట్ల స్త్రీనిధి రుణాలు పొందారు. 21 మంది మహిళలు రూ.80 లక్షల మేర పీఎంఈజీపీ రుణాలు పొంది కుటీర పరిశ్రమలు స్థాపించి ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగువేస్తున్నారు.

కావల్సిన వెంటనే..



మండలంలో మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి, పీఎంఈజీపీ రుణాలు అధికంగానే ప్రభుత్వం మంజూరు చేసింది. రుణాలు కావాలని కోరినవారికి సకాలంలో ఇస్తున్నాం. వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాం. మండలంలో ఇప్పటివరకు స్త్రీనిధి, పీఎంఈజీపీ రుణాలు పొందిన వారంతా జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని సక్సెస్‌అయ్యారు. గతంలో కంటే ఇప్పుడుసకాలంలో రుణాలు మంజూరవుతున్నాయి.

– ఎ.చిరంజీవి, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ, రాజాం

ప్రతీ నెల ఆదాయం..

మేము పీఎంఈజీపీ ద్వారా రూ.1.50 లక్షలు రుణం తీసుకున్నాం. ఏడాది క్రితం ఫ్లోర్ మిల్లు పెట్టి గ్రామంలో వ్యాపారం ప్రారంభించాం. ఆర్థికంగా స్థిరపడి బ్యాంకు రుణం చెల్లించడమే కాకుండా నెలకు రూ.4 వేల మేర ఆదాయం సమకూర్చుకుంటున్నాం. మాకు రుణంలో 35 శాతం రాయితీ కూడా వచ్చింది.

– గెంబలి శారద, శారదాదేవి మహిళా సంఘం, గడిముడిదాం, రాజాం

ఆర్థిక చేయూత..

మేం ఏడాది క్రితం రూ.2 లక్షల స్త్రీనిధి రుణం తీసుకుని వ్యాపారం ప్రారంభించాం. ప్రస్తుతం వ్యాపారాన్ని కొనసాగిస్తూ మరో నలుగురికి ఉపాధి ఇస్తున్నాం. ఏదో ఒక పని కల్పించుకోవడంతో పాటు సొంతంగా వ్యాపారం చేసే అవకాశం లభించింది. ఆర్థిక ఇబ్బందులు తప్పాయి.

– రౌతు వెంకటమ్మ, వినాయక మహిళా సంఘ సభ్యురాలు, పొగిరి

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్థు

తెర్లాం: మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ గర్భాపు లూర్థు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎంఆర్‌సీ వద్ద యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గర్భాపు మునిస్వామి ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. యూటీఎఫ్ నాయకులంతా ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు, యూటీఎఫ్ మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

రేగిడి: మండలంలో అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జి.శ్యామలాకుమారి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘ నిధులతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



వన్నలిలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ రమణ